చేయూత కింద రూ.159.57 కోట్లు జమ : కలెక్టర్

భీమవరం: వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత పథకంలో భాగంగా జిల్లాలోని 85,105 మంది అర్హులైన మహిళలకు రూ.159.57 కోట్లు ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. అర్హులకు కలెక్టరేట్‌లో గురువారం నమూనా చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల చేతుల్లో డబ్బు పెడితే అది పూర్తిగా వారి కుటుంబం కోసం, కుటుంబ ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడం కోసం ఉపయోగిస్తారనేది ప్రభుత్వ ఆలోచన అన్నారు. కార్యక్రమంలో జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, మెప్మా అధికారి గ్రంధి పార్వతి, డిపిఎం ఎం.శ్రీనివాసప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పి.అరుణకుమారి, ఉపాధ్యక్షులు డి.ప్రవీణ, కోశాధికారి వి.కమల, మహిళలు, డిఆర్‌డిఎ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'గన్ని' గరంగరం..

ఉంగుటూరు టిక్కెట్ జనసేనకు కేటాయించినట్లు ప్రచారం
పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థి ధర్మరాజుకు టిక్కెట్
పొత్తు సరే.. విజయావకాశాలు చూడరా అంటున్న గన్ని
నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం
వాడీవేడిగా ఉంగుటూరు నియోజకవర్గ రాజకీయం



భీమడోలులో టిడిపి కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, భీమడోలు

టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గన్ని వీరాంజనేయులు టిడిపి అధిష్టానంపై గరంగరంగా ఉన్నారు. పొత్తులో భాగంగా ఉంగుటూరు టిక్కెట్ జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు కేటాయించినట్లు దాదాపు స్పష్టత వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. టిక్కెట్ జనసేనకు కేటాయించినట్లు టిడిపి అధిష్టానం గన్నికి చెప్పినట్లు తెలిసింది. టిక్కెట్ తనకు కేటాయించకపోవడంపై గన్ని వీరాంజనేయులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. పొత్తు సరే, విజయావకాశాలు చూడరా అంటూ నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తల వద్ద గన్ని వాపోయినట్లు తెలుస్తోంది. అత్యవసరంగా నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో భీమడోలులో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీ అధిష్టానం తనకు అన్యాయం చేసిందని తీవ్ర ఆవేదనకు గురైనట్లు తెలుస్తోంది. న్యాయం కోసం ఏం చేయాలో తనకు తెలుసు అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. కార్యకర్తలు, నాయకుల నిర్ణయం మేరకు ముందుకు సాగుతానని అన్నట్లు తెలిసింది. ఎన్నికల్లో అస్త్ర సన్యాసం చేస్తామంటూ పలువురు నాయకులు సైతం పేర్కొన్నట్లు చెబుతున్నారు. దీంతో ఉంగుటూరు నియోజకవర్గ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. 2014 ఎన్నికల్లో ఉంగుటూరు నియోజకవర్గం నుంచి గన్ని వీరాంజనేయులు ఎంఎల్ఎగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తర్వాత టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గ టిక్కెట్ తనకే అంటూ గడిచిన ఐదేళ్లుగా పని చేస్తున్నారు. 2019 ఎన్నికల తర్వాత జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా క్షత్రియ సామాజిక తరగతికి చెందిన పత్సమట్ల ధర్మరాజును నియమించింది. అప్పటి నుంచి ఆయన అనేక కార్యక్రమాలు చేస్తూ తమ పార్టీని మరింతగా జనంలోకి తీసుకువెళ్లారు. టిడిపి, జనసేన పొత్తు ఖరారు కావడంతో ఉంగుటూరు టిక్కెట్ గన్నికి ఇస్తారా లేక ధర్మరాజుకు ఇస్తారా అనే సందేహాలు అలముకున్నాయి. తొలి జాబితాలో ఉంగుటూరు స్థానంపై ఇరుపార్టీలూ ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో ఇరుపార్టీల నాయకుల్లో మరింత టెన్షన్ నెలకొంది. ఉంగుటూరు టిక్కెట్‌పై ఇప్పటికీ అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. అయితే జనసేనకు సీటు కేటాయించినట్లు అధిష్టానం నుంచి నాయకులకు సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో టిడిపి టిక్కెట్ ఆశించిన గన్ని వీరాంజనేయులు అధిష్టానం తీరుపై మండిపడుతున్నారు. ముందుముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందో వేచిచూడాలి.

ఉంగుటూరు సీటుపై పునరాలోచించాలి

టిడిపి నేత గన్ని వీరాంజనేయులు

ఉంగుటూరు సీటు జనసేనకు కేటాయించడంపై టిడిపి, జనసేన అధినేతలు పునరాలోచన చేయాలి. ఈ సీటు జనసేనకు కేటాయించారని తెలియగానే టిడిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మెసేజీ పెడితే మూడు గంటలకు వేలాది మంది ఇక్కడకు చేరుకున్నారు. కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాను. రాజీనామాలు, ఆందోళనలు వంటివి వద్దని అందరికీ సర్ది చెప్పాను. పొత్తుతో పాటు, గెలిచే అభ్యర్థుల ఎంపిక కూడా ముఖ్యం. జిల్లా అధ్యక్షునిగా నా అభిప్రాయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాను. అధినాయకులు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నాను.

సాగు, తాగు నీరందక ప్రజల అవస్థలు

ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం - సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో తాగు, సాగునీరు పూర్తిస్థాయిలో అందక జిల్లా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక మెంటేవారి తోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం గురువారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ మే నెల రాకుండానే ఎండలు మండిపోతున్నాయన్నారు. డెల్టాలో పలు ప్రాంతాల్లో సాగునీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో వరి చేలు బీటలు వారుతున్నాయన్నారు. సొంత ఖర్చులతో ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని సాగునీరు తోడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తాగునీటికీ అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఒకవైపు తాగునీరు పూర్తిగా కలుషితమైందన్నారు. దీనికితోడు శివారు ప్రాంతాలకు నీరందక ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తాగునీరందని ప్రాంతాలకు ట్యాంకర్లతో నీరందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోడ్ల పరిస్థితి ఇప్పటికీ అధ్వానంగానే ఉందని విమర్శించారు. విద్యుత్ కోతలు అధికమయ్యాయన్నారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో విద్యుత్ కోతలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకపక్క బ్యాంకు రుణాలు, మరోపక్క ఇంటి అద్దె చెల్లించలేక నానావస్థలు పడుతున్నారన్నారు. జగనన్న ఇళ్ల కాలనీలు, టిడ్కో ఇళ్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఏళ్లు గడుస్తున్నా జగనన్న కాలనీల్లో చాలాచోట్ల మౌలిక సౌకర్యాలైన తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, వీధిదీపాలు, అంగన్వాడీ కేంద్రాలు, స్కూల్ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానాలు వంటివి కల్పించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, డి.శ్రీను, కె.బాలరాజు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీల నేతలు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. స్ట్రాంగ్‌రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ప్రతిపాదనలు, ఫిబ్రవరి 29 తర్వాత అందిన ఫారాలకు సంబంధించి ఓటర్ల చేర్పులు, మార్పులు, ఇసి ఇటీవల తెలిపిన నిబంధనలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం 85 ఏళ్లు పైబడి 40 శాతం వికలాంగత్వం కలిగి ఉన్న వారికి మాత్రమే హోమ్ ఓటింగ్‌కు అనుమతిస్తారని తెలిపారు. అటువంటి వారి జాబితాలను సిద్ధం చేస్తున్నామని, వారికి బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తామని చెప్పారు. భీమవరం, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్‌రూమ్స్ కౌంటింగ్ సెంటర్లను భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను విష్ణు కళాశాలలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించినట్లు వివరించారు. పిల్లలను ఎన్నికల ప్రచారం, ర్యాలీలు, పోస్టర్లు, కరపత్రాల పంపిణీతో సహా ఏ ఇతర రాజకీయ పనుల్లోనూ వినియోగించరాదన్నారు. ఫిబ్రవరి 29 నుండి మార్చి 6వ తేదీ వరకు ఫారం-7లు 14,789 అందాయని, వాటిలో 10,838 సిఇఒ కార్యాలయం ఆమోదించిందని తెలిపారు. బుధవారం పంపిన 856 ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మిగిలినవి పరిశీలనలో ఉన్నాయన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ బి.శివనారాయణరెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, వివిధ రాజకీయపక్షాల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాంబాబు, కోమటి రవికుమార్, కాటూరి కరుణాకర్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆచంట ముస్తాబు

ప్రజాశక్తి - ఆచంట

శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆచంట రామేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఉత్సవాలు ప్రారంభమైన రెండో రోజు గురువారం స్వామివారి ఆలయం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు భారీ సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పార్వతి అమ్మవారు లక్ష కుంకుమార్చన సహస్ర లింగార్చన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. యాత్రికులు ఇబ్బందులు పడకుండా ఆలయం చుట్టూ క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్ర కుమార్ తెలిపారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగే అన్ని రోజులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఏడాది సుమారు లక్ష మంది యాత్రకులు ఉత్సవాలకు హాజరవుతారని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బుద్ధరాజు విద్యాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

సమాచారం ఇవ్వలేదని గొల్లలకోడేరు సర్పంచి లక్ష్మి ఆరోపణ

ఇంటికి వెళ్లి పిలిచాం: వార్డు సభ్యులు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు పంచాయతీ పరిధిలోని బీడు ప్రాంతంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు, ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ చేకూరి రాజానరేంద్రకుమార్, వార్డు సభ్యులు గురువారం శంకుస్థాపన చేశారు. అయితే శంకుస్థాపన చేస్తున్నట్లు తనకు సమాచారం అందించలేదని గొల్లలకోడేరు సర్పంచి కుక్కల శ్రీలక్ష్మి ఆరోపించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తాను బిసిని కావడం వల్లే ఇలా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రొటోకాల్ పాటించలేదని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

అయితే దీనిపై పదో వార్డు సభ్యులు కుక్కల బాబూరావు, ఏడో వార్డు సభ్యులు వీరవల్లి శ్రీను, 9వ వార్డు సభ్యులు తంగేళ్ల లక్ష్మణస్వామి మాట్లాడుతూ సర్పంచి ఇంటికి వెళ్లి శంకుస్థాపనకు హాజరు కావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. సర్పంచి లక్ష్మి ఫొటోతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామని, కావాలనే రాకుండా రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత తప్పనిసరి

తాడేపల్లిగూడెం: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి మూర్తి తెలిపారు. ఈ నెల 15న ఆసరా సంస్థ నిర్వహించే వరల్డ్ కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ డే సందర్భంగా జిల్లాలో సైబర్ నేరాలు అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గురువారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఆసరా సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ డే బుక్‌లెట్‌ను డిఎస్‌పి మూర్తి, పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. సైబర్ నేరాలను జిల్లాలో పూర్తిస్థాయిలో అరికట్టేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని ఆసరా సంస్థ అధ్యక్షుడు కొడాలి రమేష్‌బాబు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా జనరల్ సెక్రటరీ బత్తుల ప్రసాద్ చెప్పారు.

సర్రాజు సేవలు చిరస్మరణీయం

వర్ధంతి సభలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొయ్యే మోషేన్‌రాజు

ప్రజాశక్తి - కాళ్ల

రైతులు, పేదల శ్రేయస్సు కోసం కీర్తిశేషులు మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు చేసిన సేవలు చిరస్మరణీయమని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కొనియాడారు. భీమవరం ఆదర్శనగర్ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు ప్రథమ వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. తొలుత సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ పాతపాటి సర్రాజు ఆప్యాయతకు మారుపేరన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, టిటిడి సభ్యులు గాదిరాజు సుబ్బరాజు (మందలపర్రు సుబ్బరాజు), మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు. సర్రాజు జ్ఞాపకార్థం సర్రాజు చిత్రంతో ఉన్న క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

అన్నింటా.. ఆమె..

నేడు మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖుల మనోగతం

భారతీయ మహిళ తల్లిగా, భార్యగా, కోడలిగా ఇలా అనేక రూపాల్లో తన బాధ్యతలను నిర్వర్తిస్తూ విద్య, వృత్తి, ఉద్యోగాల్లో రాణిస్తోంది. పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి పథాన దూసుకెళ్తోంది. అయితే మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులు ఎక్కువవుతున్నాయి. భద్రత లేదు. ఎన్ని చట్టాలు వచ్చినా పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదు. ప్రభుత్వం చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. మహిళలకు విద్య, ఉద్యోగాల్లో మరింత స్వేచ్ఛ ఇవ్వాలి. మహిళా దినోత్సవం సందర్భంగా పలువురి ప్రముఖ మహిళల అభిప్రాయాలు..

బాధ్యత అందరిదీ.. ★ ★ ★

ఘంటా పద్మశ్రీ ప్రసాద్, జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఏలూరు

మహిళలపై అత్యాచార సంస్కృతి పెచ్చుమీరడం తీవ్ర ఆందోళన కల్గిస్తోంది. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలం. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో మహిళలు రాణిస్తూ మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. తాము ఇంటికే పరిమితం కాదంటూ పురుషులకు దీటుగా విజయాలు సాధిస్తున్నారు. డిజిటల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ నినాదంతో మన దేశంలో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతున్నాయి. మహిళా సాధికారత, లింగ సమానత్వంలో సాధించిన విజయాల కోసం పోరాడిన నారీ మణులకు నారీశక్తి పురస్కారాలు అందజేస్తారు. ఆ పురస్కారాలే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేసేందుకు మహిళా శక్తికి ఆదర్శంగా నిలుస్తాయి. ఇంట్లోని ఆడవారిని గమనించి, గుర్తించి, ఆదరించి, గౌరవించడం తెలిస్తే బయట కూడా అదే విధమైన ప్రవర్తన ఉంటుంది. బాధ్యతల నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, అధికార, అనధికారులు ఎవరూ తప్పించుకోలేరు. స్త్రీ పట్ల ఏదైనా పొరపాటు జరిగిందంటే స్పందన అత్యంత తీవ్రంగా ఉండాలిల్సిందే. ఇది అందరి బాధ్యత. సమాజం నుంచి ప్రతి మహిళకూ అందాల్సిన సాయం అదే. నాకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా అవకాశం వస్తుందని అనుకోలేదు. నాకు నా భర్త ప్రసాద్‌రావు, సిఎం జగన్, దెందులూరు ఎంఎల్ఎ అబ్బాయిచౌదరి ప్రోత్సాహం ఎనలేనిది. అందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

రాజకీయాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యతివ్వాలి

బర్రి శ్రీ వెంకటరమణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్, నరసాపురం

నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న నాతోపాటు, 31 మంది కౌన్సిలర్లలో 18 మంది మహిళలే ఉన్నారు. మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రానున్న ఎన్నికల్లో ఎంపీ, ఎంఎల్ఎ టిక్కెట్లలో అన్ని పార్టీలూ ప్రాధాన్యతివ్వాలి. విద్యార్థులు మంచి భవిష్యత్తు ఉంది. విద్యార్థులు ప్రభుత్వం ఉచిత ట్యాబ్‌లు, విద్యాదీవెన పథకం ఉపయోగించుకుని చదువుకోవాలి. తోడైతే మహిళా సాధికారత పూర్తిస్థాయిలో సాధ్యమవుతుంది. ఆ దేశం ఉన్నత స్థాయికి ఎదుగుతుంది. నేను జిల్లా అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా నాకు నా కుటుంబ సభ్యుల సహకారం ఎల్లప్పుడూ ఉంటోంది. మహిళా సాధికారత సాధనకు కుటుంబాల బలం కూడా మహిళలకు కీలకం.

ఎండమావిలా సమానత్వం.. ★ ★ ★

డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు

భారతీయ మహిళ ఒక తల్లిగా, భార్యగా, కోడలిగా, సోదరిగా, ఇలా ఎన్నో రూపాల్లో తన బాధ్యతలను నిర్వర్తిస్తోంది. అయినా సమానత్వం అనేది ఎండమావిలా కన్పిస్తోంది. పూర్వంతో పోల్చితే మహిళను చూసే విధానంలో చాలా మార్పు వచ్చింది. అయితే సమాజం ఇంకా మారాల్సిన అవసరం ఉంది. స్త్రీ అంగడి వస్తువు కాదు అని ప్రతి ఒక్కరూ గుర్తించిన రోజున సమాజం మరింత ముందుకెళ్లడానికి అవకాశం ఉంటుంది.

తగ్గిన ఉపాధి, వేతనాలు.. ★ ★ ★

పొగాకు పూర్ణ, ఐద్వా పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి

మహిళలకు ఉపాధి, సాధికారత, అభివృద్ధి మనదేశంలో క్రమంగా తగ్గుతోంది. 2018 నాటికి 21.9 శాతం మహిళలు భద్రత కలిగిన ఉపాధిలో ఉన్నారు. 2023 నాటికి ఇది 15.9 శాతానికి పడిపోయింది. అసంఘటిత రంగంలో పని చేసే మహిళలు గణనీయంగా పెరుగుతున్నారు. భద్రత లేదు. నిలకడ లేని పనులు చేయాల్సి వస్తోంది. కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు పెరగడంతో అనివార్యంగా మహిళలు ఏదోక పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భద్రత లేని ఉపాధి, తక్కువ వేతనాల వల్ల మహిళా సాధికారత కాగితాలకే పరిమితమైంది. లక్షలాది మంది మహిళలు ఉత్పత్తిలో భాగమవుతున్నారు. మహిళల పాత్ర ఉత్తేజకరంగా మారాలి. రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావాలి. అప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుంది. మహిళలు మరింత శక్తివంతులుగా తయారవుతారు.

చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలి.. ★ ★ ★

సి.నీరజ, బిజిబిఎస్ మహిళా కళాశాల ప్రిన్సిపల్, నరసాపురం

మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పోటీ పడుతున్నారు. అన్ని రంగాల్లో మహిళలు స్వేచ్ఛ, సమానత్వం పొందడానికి చదువు కావాలి. సమానత్వానికి చదువే కీలకం. బాలికలు తప్పనిసరిగా విద్య అభ్యసించాలి. అదే వారిని ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ధైర్యంగా ముందుకు నడిపిస్తుంది. మహిళలు అందరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు.

మహిళాభివృద్ధే..దేశాభివృద్ధి.. ★ ★ ★

ఎస్.శాంతకుమారి, జిల్లా ఉప రవాణా కమిషనర్, ఏలూరు

అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రపంచంలో అతి ఎక్కువ సర్వేలు చెబుతున్నదేమిటంటే పురుషులతో సమానంగా మహిళలూ ఎదిగితేనే ఆ దేశం పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఇది సాధ్యం. దీనికిగాను మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం పొందాలి. దాంతోపాటు ముందుగా తమ ఇళ్లలో పిల్లలను విద్యావంతులుగా చేయాలంటే వారు ముందుగా చదువుకుని ఉండాలి. అందుకే మహిళలు విద్యావంతులు కావడం ఎంతో అవసరం. దీనికి ఆర్థిక స్వాతంత్ర్యం

మరింత చేయూత అవసరం.. ★ ★ ★

షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏలూరు నగర మేయర్

ఏలూరు నగరానికి రెండుసార్లు మేయర్‌గా పని చేయడం గొప్పగా భావిస్తున్నాను. మహిళలు ఎంతో గొప్పవారు. సహనంలోను, తెలివితేటల్లోనూ, అర్థం చేసుకోవడంలోనూ, క్రమశిక్షణలోనూ ఎంతో గొప్పగా ఉంటారు. కెప్టెన్ లక్ష్మీ సెహెగల్‌తో వనితల జాగృతి మొదలైంది. గత పాతికేళ్లను తరచిచూస్తే ఏటా ఒక ప్రచారాంశాన్ని ఐక్య రాజ్యసమితి ప్రకటిస్తూ వస్తోంది. ప్రస్తుత అంశం - లింగ సమానత్వం. పాశ్చాత్య వైద్యంలో సుశిక్షణ అందుకున్న తొలి భారతీయ వనితారత్నం ఆనందీబాయి అమెరికాకు మొదటగా ప్రయాణం చేసిన మహిళామణి. మొట్టమొదటి ఆటోరిక్షా సారథిగా పేరొందిన మరొక భారతీయురాలు షీలా. అంగవైకల్యం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో ప్రథమంగా అత్యున్నత ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పర్వతారోహకురాలు అరుణిమ. మోడలింగ్ రంగానికే తలమానికంగా రీటా, స్విమ్మర్‌గా ఆర్తి, క్రికెట్‌లో మిథాలీరాజ్, వ్యోమగామి కల్పనా చావ్లా, పోలీసు అధికారి కిరణ్‌బేడీ స్ఫూర్తి నేపథ్యం మహిళా దినోత్సవానికి మరింత శోభనిచ్చింది. నా భర్త పెదబాబు ప్రోత్సాహం అద్భుతం. అలాంటి ప్రోత్సాహం అందరికీ లభించాలి. అప్పుడే మహిళలు రాణిస్తారు.

సోషల్ మీడియాకు ఆకర్షితులు కారాదు.. ★ ★ ★

మంగాదేవి, టౌన్ సిఐ, పాలకొల్లు

గతంలోకన్నా మహిళా ఉద్యోగుల సంఖ్య అన్ని రంగాల్లో పెరుగుతోంది. ఇంకా సగం జనాభాకు తగ్గట్లు ఎటువంటి రిజర్వేషన్ లేకుండానే మహిళా ఉద్యోగుల సంఖ్య పెరగాల్సి ఉంది. మహిళలు ఆర్థికంగా, విద్యాపరంగా సాంఘికంగా అభివృద్ధి చెందితే సమాజం కూడా అభివృద్ధి చెందినట్లు. యువత సోషల్ మీడియాకు ఆకర్షితులు కాకుండా తమ జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలి.

మహిళలకు మరింత స్వేచ్ఛ ఇవ్వాలి.. ★ ★ ★

డాక్టర్ శోభారాణి, ప్రిన్సిపల్, డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల, పాలకొల్లు

మహిళలకు విద్య, ఉద్యోగాల్లో మరింత స్వేచ్ఛ ఇవ్వాలి. ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆవశ్యకత ఎంతైనా ఉంది. మహిళలు విద్యావంతులై ఆర్థికంగా ముందంజలో ఉంటే సమాజం కూడా ముందంజలో ఉంటుంది. కుటుంబంలో మహిళలు విద్యావంతులు కావడానికి మరింత ప్రోత్సాహం అవసరం. మహిళలు ఉన్నత విద్యావంతులు కావడానికి కృషి, పట్టుదల అవసరం. మహిళల రక్షణకు మరిన్ని చట్టాలు రావాలి. అప్పుడే మహిళలు మరింత స్వేచ్ఛగా వృత్తి, ఉద్యోగాల్లో రాణించగలుగుతారు.

మహిళలు వివాహం తర్వాతా విద్యాభ్యాసం కొనసాగించాలి.. ★ ★ ★

డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ప్రిన్సిపల్, ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, పాలకొల్లు

ప్రస్తుతం విద్యావంతులైన మహిళలు అని రంగాల్లో దూసుకుపోతున్నారు. అయితే గ్రామీణ మహిళలు ఇంకా విద్యావంతులు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు వివాహమయ్యాక చదువుకు స్వస్తి చెబుతున్నారు. అలా కాకుండా వివాహమైనా విద్యాభ్యాసం సాగించి ఇటు ఉద్యోగం, అటు కుటుంబాన్ని నడపడం అలవర్చుకోవాలి.

జగనన్న సురక్షను వినియోగించుకోండి

నరసాపురం:జగనన్న సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని 31వ వార్డు సచివాలయం వద్ద సురక్ష ఫేజ్ -2 శిబిరాన్ని కమిషనర్ గురువారం ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. శిబిరంలో 400 మందికి పైగా ప్రజలు వైద్య సేవలందించుకున్నారని యుపిహెచ్‌సి డాక్టర్ శిరిగిరీడీ సత్య భూషణ్ తెలిపారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ ఏడిదకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనసాగిన ఇంటర్ పరీక్షలు

నరసాపురం:ఇంటర్ ద్వితీయ సంవత్సరం మాథ్స్, సివిక్స్, బోటని పేపర్-2 పరీక్ష గురువారం జరిగాయి. పట్టణంలోని ఆదిత్య, వైన్ డైమండ్ జూబ్లీ, శ్రీ సూర్య, ఉమెన్స్, గౌతమి, భాష్యం కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉండటంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బిబిఎస్ ఉమెన్స్ కళాశాలలో 239 మందికి గాను 230 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

విద్యారంగానికి మార్గదర్శి జగపతిరాజు

భీమవరం రూరల్ :విద్యారంగానికి మార్గదర్శిగా నిలిచి ఎంతో మంది ఇంజినీర్లను సొసైటీకి అందించిన ఘనత ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజుకు దక్కుతుందని శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెడికల్ ఇంజినీరింగ్ సొసైటీ డాక్టర్ జగపతిరాజుకు ప్రతిష్టాత్మకమైన లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జగపతి రాజును రంగసాయి సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీ కృష్ణంరాజు మాట్లాడారు.

సేవా తత్పరతకు నిదర్శనం అద్దేపల్లి : ఎంఎల్ఎ నిమ్మల

పాలకొల్లు :సమాజంలో దాతృత్వంలో అద్దేపల్లి అగ్రస్థానమని, అటువంటి కోవకు చెందిన అద్దేపల్లి సత్యనారాయణమూర్తి సేవా తత్పరతకు నిదర్శనమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక అద్దేపల్లి వారి సత్రంలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంవత్సరం పాటు ప్రతినెల జరిగే అద్దేపల్లి జయంత్యుత్సవ వేడుకల సభలో ఆయన మాట్లాడారు. ముందుగా అద్దేపల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 92 వ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ సందర్భంగా అద్దేపల్లి సంఘ నాయకులు నాళం బాపిరాజు, మానేపల్లి వెంకటరావు, కంచర్ల కనకం, బంగారు వెంకట రామారావు, ఇమ్మిడి రాజేష్, బొండాడ చినబాబు, కంచర్ల వెంకట్రావు, గాదె జనార్దన గుప్తను ఎంఎల్ఎ సత్కరించారు.

గ్రామాభివృద్ధికి శ్రీరంగనాథరాజు కృషి అభినందనీయం

ఆచంట:కోడమంచిలి గ్రామాభివృద్ధికి శ్రీరంగనాథరాజు చేసిన కృషి అభినందనీయమని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. గురువారం సర్పంచి అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుంకర సీతారామ్ మాట్లాడుతూ సోమవారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు గ్రామంలో పర్యటిస్తారని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, స్కూల్ ప్రారంభోత్సవాలు, వైఎస్ఆర్ విగ్రహం ఆవిష్కరణ, దేవస్థాన నూతన కమిటీ ప్రమాణస్వీకారం, లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన భూహక్కు పత్రాల పంపిణీ తదితర కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి ముల్లగాడి వరప్రసాద్, మెంబర్లు రామకృష్ణ, శ్రీను, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నివాసయోగ్యంకాని స్థలాలు కట్టబెట్టొద్దు

వీరవాసరం:మెంపులో గురువుతున్న జగనన్న లే అవుట్ స్థలాన్ని లబ్ధిదారులకు బలవంతంగా కట్టబెట్టే చర్యలను మానుకోవాలని టిడిపి, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. గురువారం టిడిపి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో అందరూ మెంపులో గురువుతున్న జగనన్న లే అవుట్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో నివాసానికి అనువుగాని స్థలాన్ని హడావుడిగా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పేరుతో అంటగడుతున్నారని విమర్శించారు. జిఐఎండిఎ కెనాల్‌కు ఆనుకుని ఉన్న ఈ లేఅవుట్ కాలువ నీరు పెరిగిన ప్రతిసారీ మునిగిపోయి గురువుతుందని తెలిసి కూడా ఈ స్థలాన్ని కొనుగోలు చేయడంలో స్థానిక వైసిపి నాయకులు, ఎంపిటిసీలకు ముడుపులు అందాయని విమర్శించారు. ఇంటి నిర్మాణానికి అనువైన భూమిని లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసీ వీరవల్లి దుర్గాభవాని, జనసేన ఎంపిటిసీ యాళ్లబండి ఇందిర, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వరిధనంలో నిమ్మల సతీమణి ప్రచారం

పాలకొల్లు రూరల్: ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సతీమణి సూర్య కుమారి గురువారం మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో భాగంగా వరిధనం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఉచిత పథకం అమలుచేయనుందని తెలియజేశారు. కార్యక్రమంలో డి.జ్యోతి, విప్పర్తి ప్రేమజ్యోతి, పాండారి వరిత, సీత, కనకదుర్గ పాల్గొన్నారు.

బ్యాంకును విలీనం చేయొద్దు

ఖాతాదారుల రాస్తారోకో

ఆచంట:పెత్తారామేశ్వరం గ్రామస్తులకు సంబంధించిన యూనియన్ బ్యాంకుని పెనుమంట్ర యూనియన్ బ్యాంకులో విలీనం చేసేందుకు బ్యాంక్ అధికారులు సన్నాహాలు చేయడంతో గురువారం మధ్యాహ్నం బ్యాంక్ ఎదురుగా సుమారు 150 మంది ఖాతాదారులు, గ్రామస్తులు రహదారిపై ఆందోళన, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెనుమంట్ర యూనియన్ బ్యాంకులో విలీనం చేస్తే సుమారు నాలుగు కిలోమీటర్లు మేర నడిచి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పెనుమంట్ర తహశీల్దార్ కళ్యాణి ఖాతాదారులకు నచ్చజెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ధర్మారెడ్డి, ఎంపిటిసీ పి.ఎం.రెడ్డి, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఘనంగా సన్‌షైన్‌లో సైన్స్‌ఫెస్ట్

పాలకొల్లు :లయన్స్ కమ్యూనిటీ హాల్లో సన్ షైన్ స్కూల్ ఆధ్వర్యంలో సైన్స్‌ఫెస్ట్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆడిటర్ లక్ష్మీనారాయణ విచ్చేశారు. విద్యార్థులు ఎగ్జిబిట్ చేసిన సైన్స్ ప్రాజెక్టులను వీక్షించి అభినందించారు. మారుతున్న సైన్స్ అండ్ టెక్నాలజీతో సమానంగా మానవ జీవన విధానం కూడా మారుతోందని, ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని అన్వేషిస్తూ ఉండాలని కోరారు. అనంతరం నూతన టెక్నాలజీని ఉపయోగించి వర్కింగ్ ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రధమ, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ బహుమతులు ముఖ్య అతిథులు అందజేశారు. స్కూల్ విద్యార్థులు 200 ప్రాజెక్టులను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన వైఎన్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.సుబ్రహ్మణ్యం, ఆయన సతీమణి టైలర్ స్కూల్ రిటైర్డ్ హెడ్మాస్టర్ పద్మావతి పరిశీలించారు. అన్ని ప్రాజెక్టులు చాలా గొప్పగా ఉన్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మేడం అరుణ నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్‌వి విఎస్.పాపారావు నాయుడు, లయన్స్ క్లబ్ సెక్రటరీ మాఘం నారాయణ రావు పాల్గొన్నారు.

'టిడిపి హయాంలోనే మహిళలకు పెద్దపీట'

తణుకు:రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఆడపడుచులకు పెద్దపీట వేసింది టిడిపి అని మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలో సకల జనుల పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నాలుగున్నర సంవత్సరాల కాలంలో మహిళల ఉసురు పోసుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏలు ముళ్ళపూడి వెంకట కృష్ణారావు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ పరిమి వెంకన్నబాబు పాల్గొన్నారు.

బిసిల అభివృద్ధికి వైసిపి కృషి

ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్

పాలకోడేరు : బిసిల అభివద్ధికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గొల్లలకోడేరులో ఉండి ఎఎంసి వైస్ ఛైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కుమార్ (నరేంద్రరాజు) ఆధ్వర్యంలో టిడిపికి చెందిన సుమారు 100 మంది వైసిపిలో చేరారు. వారికి పివిఎల్ నరసింహరాజు, కౌరు శ్రీనివాస్, ఎంపిపి చంటి రాజు, నరేంద్ర రాజు వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడారు. వైసిపి ఐదేళ్ల కాలంలో బీసీలకు పెద్దపీట వేసిందన్నారు. ఎంఎల్‌సి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీకి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఉండి ఎఎంసి ఛైర్మన్ బి.వెంకటేశ్వరరావు, ఎంపిటిసి కె.వెంకటలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజా ప్రయోజనార్థం గ్రామస్తులకు మినరల్ వాటర్ అందించాలనే లక్ష్యంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. పల్లెపాలెంలో వెరిటాక్ యూనిమల్ హెల్త్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో నిర్మించిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఎంఎల్ఎ మంతెన రామరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెరిటాక్ సంస్థ ఆధ్వర్యంలో రూ.3 లక్షలతో నీటి శుద్ధి పరికరాలను పల్లెపాలెంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో రూ.90 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తిరుమలశెట్టి శకుంతల, ఎంపిటిసి తిరుమలశెట్టి లీలావతి, కలవపూడి సర్పంచి గేదెల జాన్, మాజీ సర్పంచి తిరుమాని మార్రాజు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

విద్యార్థుల ఉన్నతిలో యుటిఎఫ్ పాత్ర అద్వితీయం

శాసనమండలి సభ్యులు ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - యలమంచిలి

గత 27 సంవత్సరాలుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో 5, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహించడంతోపాటు ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తూ వారిని ప్రోత్సహిస్తున్న యుటిఎఫ్ సేవా దృక్పథం అభినందనీయమని శాసనమండలి సభ్యులు ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి శిరగాలపల్లి హైస్కూల్ గ్రౌండ్ వద్ద ప్రతిభా పాటవ పరీక్షల బహుమతి ప్రదానోత్సవ సభకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 27 ఏళ్లుగా విరామం లేకుండా విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహించి వేల మంది విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఘనత రాష్ట్రంలో ఒక్క యుటిఎఫ్‌కు మాత్రమే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపీమూర్తి, కీర్తిశేషులు సాబ్జీ సతీమణి షేక్ శుభాని బేగం, కుమారుడు షేక్ అబుల్ కలాం ఆజాద్, జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్, మండల అధ్యక్షులు జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇళ్ల వెంకటేశ్వరరావు

27 సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి ప్రభుత్వంలో రద్దయిన 27 సంక్షేమ పథకాలు పునరుద్ధరించి రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో పొందుపర్చాలని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, సమైక్య రాష్ట్ర అధ్యక్షులు సోడదాసి గంగయ్య పిసిసి అధ్యక్షురాలు షర్మిలను కోరారు. విజయవాడలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సమైక్య ఆధ్వర్యంలో షర్మిలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోడదాసి గంగయ్య మాట్లాడారు. దళిత, దళిత క్రైస్తవ, ముస్లిం మైనార్టీల మీద అనేక దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమీపిస్తున్న వేళ అన్ని రాజకీయ పార్టీలకూ వినతిపత్రాలు అందించాలని కార్యాచరణ రూపొందించామన్నారు. ఏవైతే పథకాలు వైసిపి ప్రభుత్వంలో రద్దు చేయబడ్డాయో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో రద్దయిన పథకాలు పునరుద్ధరించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐసిఎఫ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తే రాజ్‌కుమార్, కొండా రాజేష్ కుమార్, గొల్ల దానియేలు, సొడదాసి రతన్‌రాజు పాల్గొన్నారు.

డిఎన్ఆర్ వాకర్స్ ఆధ్వర్యాన మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

డిఎన్ఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలోని రాధాకృష్ణ నేత్రాలయ వి.రవికుమార్ రాజు సౌజన్యంతో కళాశాల యాజమాన్యం వారి సహాయ సహకారంతో గురువారం కళాశాల ఆవరణలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో హైదరాబాద్ స్టార్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్ జి.శశికాంత్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రవికుమార్ రాజు కంటి పరీక్షలు నిర్వహించి కంటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. భీమవరం ఒమిక్స్ ల్యాబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.మధుబాబు పర్యవేక్షణలో రోగులకు ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.పల్లారావు, కార్యదర్శి పి.సీతారామరాజు, జాయింట్ సెక్రటరీ అడపా బాబ్జి, సభ్యులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

పాలకొల్లు :మహాశివరాత్రి సందర్భంగా క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో రానున్నారని, అన్ని సౌకర్యాలూ కల్పించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. పెదగోపురంలో మహాశివరాత్రి ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. సుమారు 50.000 మంది యాత్రికులు వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనం కలిగేలా చూడాలని అధికారులకు తెలిపారు. ఆయన వెంట ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, సాలా నర్సయ్య పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యాన చలివేంద్రం

ప్రజాశక్తి - ఆచంట

పాదచారుల దాహార్తిని తీర్చడమే ప్రజాసంఘాల ముఖ్యోద్దేశమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. స్థానిక కచేరీ సెంటర్లో మహాశివరాత్రి సందర్భంగా వచ్చే యాత్రికుల కోసం గురువారం నెక్కంటి రామదాసు, అన్నపూర్ణమ్మ స్మారకార్థం సిఐటియు, యుటిఎఫ్, డివైఎఫ్ఐ, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్ర కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదాచారుల దాహార్తి తీర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు సిర్రా నరసింహమూర్తి, పరువు మోహన్‌రావు, వద్దిపర్తి అంజిబాబు, కుసుమే జయరాజు, రైతుసంఘం నాయకులు కొండేటి సత్యనారాయణ, సరిళ్ల రాధాకృష్ణ, రాంబాబు, కె.రాజు, బెనర్జీ, వీరబ్రహ్మం, సత్యనారాయణ, విఘ్నేశ్వరుడు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సత్యనారాయణకు డాక్టరేట్

భీమవరం రూరల్ :ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఐటి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కంతేటి సత్యనారాయణ రాజుకు అన్నమలై యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా యాజమాన్యం తరపున కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కెఎస్ఎన్.రాజు మాట్లాడుతూ డైనమికల్లీ, ఆప్టిమైజ్డ్ అండ్ సెక్యూర్ రౌటింగ్ అప్రోచ్ ఇన్ వాగైడ్' అనే అంశంపై అన్నమలై యూనివర్సిటీ ఐటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సెల్వకుమార్ పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ డాక్టర్ ప్రధానం చేసింది అన్నారు. కళాశాల డైరెక్టర్ జగపతి రాజు మాట్లాడుతూ ఐటి ప్రొఫెసర్స్ సొసైటీకి ఉపయోగపడే సమాచార వ్యవస్థ మరింత మెరుగుపడే విధంగా పరిశోధనలు చేయటం అభినందనీయమన్నారు. అనంతరం యాజమాన్యం ఆయనను అభించింది.

రహదారి మరమ్మతు పనులకు శంకుస్థాపన

కాళ్ల:పెదఅమిరంలోని అభ్యాస్ స్కూల్లో ఆర్అండ్‌బి సహాయ నిధులు సుమారు రూ.40 లక్షలతో ఆర్అండ్‌బి ప్రధాన రహదారి మరమ్మత్తుల పనులకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాస రాజు, వైసిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితతోనే సమాజాభివృద్ధి

భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవి

ప్రజాశక్తి - భీమవరం

మహిళలు సాధికారిత సాధిస్తేనే సమాజాభివృద్ధి సాధ్యమని భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవి అన్నారు. ప్రతి మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. స్థానిక త్యాగరాజు భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఐద్వా, యుటిఎఫ్, శ్రామిక మహిళ ఆధ్వర్యంలో మహిళ సాధికారిత-సమాజాభివృద్ధి అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. దీనికి శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవి, వైద్య ఆరోగ్యశాఖ డిజిఒ దేవసుధ విచ్చేశారు. వారు మాట్లాడుతూ మహిళలంతా చదువుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. మహిళా చైతన్యం కోసం ఐద్వా నిరంతరం ఎంతో శ్రమిస్తుందన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి పూర్ణ మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజు తప్ప మిగిలిన రోజుల్లో మహిళాభివృద్ధి కోసం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. తక్షణం 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యారోగ్య శాఖ డిపిహెచ్‌ఎంఒ వెంకటరత్నం మాట్లాడుతూ మహిళలపై అకృత్యాలను ప్రశ్నిస్తూ అంతా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మి, అంగన్వాడీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మహాలక్ష్మి, డ్వాక్రా యానిమేటర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోవిందమ్మ, మదర్సా కమిటీ కన్వీనర్, కౌన్సిలర్ పాలవెల్లి మంగ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత వరలక్ష్మి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.ఉదయకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ వెంకటలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ లారెన్స్‌కుమారి, ఆయా సంఘాల నేతలు సరోజిని, నాగరత్నం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవి

సమాజంలో మహిళలు స్వశక్తితో రాణించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు భూసి వినిత అన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు కళ్యాణ మండపంలో మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ పిడి బి.సుజాత రాణి అధ్యక్షతన మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వినీత ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆడపిల్లలను రక్షించాలని, చదివించాలన్నారు. ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని చెప్పడమే కాకుండా చేతల్లో చేసి చూపించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ ఎస్.కీర్తికిరణ్, జిల్లా ఇమ్యునజేషన్ అధికారి దేవ సుధా లక్ష్మి, దిశ పోలీస్ స్టేషను ఎస్ఐ సిహెచ్. విజయలక్ష్మి, పాల్గొన్నారు.

తణుకురూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా వివక్ష మాత్రం తప్పడం లేదని శ్రీ శ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.దక్షిణామూర్తి అన్నారు. గురువారం శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రం, ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో దేశాభివృద్ధిలో మహిళల పాత్ర-సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి, ఐద్వా నేత అడ్డగర్ల అజయకుమారి మాట్లాడారు. పాఠశాల విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖులు వావిలాల సరళాదేవి, సంకు మనోరమలను సత్కరించారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత కంప్యూటర్, టైలరింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పిఎల్.నర్సింహారావు, రాజ్యలక్ష్మి, శాంతి, సీతారామయ్య, రాజా, గోపి, రంగారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఆర్థిక అసమానతలు అతివల అభివృద్ధికి అడ్డంకి కాకూడదని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ లీలాకుమారి అన్నారు. శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ జ్యోతి, కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు మాట్లాడారు.

ఆచంట: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్ నార్త్ మహిళా విభాగం అధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల సేవలు అద్వితీయమని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఫాతిమాబీబీ అన్నారు.కొత్త కనకరత్నమాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం.లలిత, టి.రమాదేవి, తేజస్విని, ఝాన్సీ, కృష్ణవేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురం:మహిళలు అని రంగాల్లో ముందుండాలని మున్సి పల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తుగా గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లకు, కోఆప్షన్ మహిళ సభ్యులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమానికి కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ శ్రీ వెంకటరమణ, వైస్ ఛైర్మన్ కామన నాగిని, కమిషనర్ కె.వెంకటేశ్వర్లు, పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. సచివాలయ పరిధిలోని పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు దళం సినిమాలోని పాట పాడారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వరరావు మున్సిపల్ ఛైర్ పర్సన్‌ను సత్కరించారు.

మహిళా న్యాయవాదులు కలిసికట్టుగా ఉండి ఒకరికొకరు సహకరించుకోవాలని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్ పి. విజయ దుర్గ ఆకాంక్షించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవా సంస్థ మరియు బార్ అసోసియేషన్ ఉమ్మడి ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో మహిళా న్యాయవాదులకు, మహిళా కోర్టు సిబ్బందికి నిర్వహించిన ఇండోర్ గేమ్స్ లో విజేతలకు బార్ అసోసియేషన్ తరపున న్యాయమూర్తుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళా న్యాయవాదులకు, కోర్టుల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి, స్వీపర్లకు బహుమతులు అందజేశారు. స్వీపర్లకు రెడ్ క్రాస్ తరపున రగ్గులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్‌తో పాటు సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సామాజిక వేత్త నిట్టల శైలజ మాట్లాడారు. పురుషులతో సమానంగా స్త్రీలు కూడా పోటీ ప్రపంచంలో ముందుకెళ్తున్నార న్నారు. అనంతరం ఎంఇఒలు జి.వీరస్వామి, శర్మ మహిళా ఉపాధ్యాయిలను ఘనంగా సత్కరించారు.

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

O.S. No. 12/2021

Between:
Penumarthi Srinivas ...*Plaintiff*
AND
Pothula Ramya & Another ...*Defendants*

Defendant No-1:
Pothula Ramya, W/o. Desam Syam Sundar Reddy, Yarraguntapalli, Chinthalapudi Mandal.

Defendant No-2:
Desam Syam Sundar Reddy, Yarraguntapalli, Chinthalapudi Mandal.

సదరు పై నెంబరు గ్రంధమున శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు జారీ చేసియున్నప్పటికిన్నీ ఉద్దేశ్య పూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **ది. 25-03-2024 సం॥ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మహారాజశ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

N.S.R.N.CHOWDARY
Advocate & Notary
కొవ్వూరు Kakinada
ది.20-2-2024 Cell: 9848222585

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

ఆర్.ఓ.సి. నెం.20/2023/ఇ1 **తేది.07-03-2024**

జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులు చేపట్టుటకు ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా టెండరులు పిలువబడుచున్నది.

వ.నెం.	పని వివరము	పనుల సంఖ్య	ECV (రూ. లక్షలలో)
1.	జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో సాధారణ నిధుల నుండి మోటార్లు & మెటీరియలు సరఫరా	01	10.00

సంబంధిత వివరములు https://tender.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 08-03-2024వ తేదీ ఉదయం గం॥ 10.00ల నుండి చూడవచ్చును. ఇతర వివరములకు మున్సిపాలిటీ కార్యాలయము, ఇంజనీరింగ్ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమిషనరు**
జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

CHANGE OF NAME

I, SONGA YESURATNAM, S/o YESEBU, Residence of D.No:3, Katrenipadu Village, Musunuru Mandal. Eluru District, do here by solemnly affirm and sincerely state on oath as follows:

I, here by declare that my daughter name is **JASMINE SONGA** is studied in your **SEVENTH DAY ADVANTIST HIGHER SECONDRY SCHOOL, NUZVID,** UNIQUE ID: 8279097. She is studing in I.C.S.E (Class X), No: 1244181/050 in 2024.

In that certificate my daughter's name was wrongly mentioned in **MARY JASMINE SONGA** instead of **JASMINE SONGA.** Hence, I request to the School Authorities to correcting the above mistake with correct my daughter Name **JASMINE SONGA.**

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 39/2023

Plaintiff: Mullapudi Satya Surendra
Defendant: Vegi Vijaya Venkata Rama Jogi Surya Vara Prasad
To:
Vegi Vijaya Venkata Rama Jogi Surya Vara Prasad, S/o. Venugopala Krishna murthy, Lakshmi Nagar, H/o. Gunnampalli, Dwaraka Tirumala Mandalam, Bhimadole, J.C.J.

పై నెంబరు దావాలో ప్రతివాది ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను దావా సంగతులు తెలిసియుండి సదరు సమన్లు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు యిచ్చి **ది. 14-03-2024కి వాయిదా వేసియున్నారు.** కావున మీరు సదరు వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

KUSULURI SIVA RAMA KRISHNA
Advocate for Plaintiff
Tadepalligudem Tadepalligudem
Date: 07-03-2024 Cell: 9949076266

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No. 932/2023 in O.S. No. 39/2023

Petitioner/ Plaintiff:
Mullapudi Satya Surendra
Respondent/ Defendant:
Vegi Vijaya Venkata Rama Jogi Surya Vara Prasad
To:
Vegi Vijaya Venkata Rama Jogi Surya Vara Prasad, S/o. Venugopala Krishna murthy, Lakshmi Nagar, H/o. Gunnampalli, Dwaraka Tirumala Mandalam, Bhimadole, J.C.J.

పై నెంబరు జప్తు పిటిషనులో మీ ఆస్తి జప్తుకు షోకాజు నోటీసు పంపగా మీరు సదరు నోటీసు సంగతి తెలిసియుండి సదరు నోటీసు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు గాను ఆర్డరు వేసియున్నారు. కావున యీ పేపరు ప్రకటన తేది నుండి 48 గంటల లోపుగా మీరు దావా మొత్తంకు తగు సెక్యూరిటీ ఇవ్వవలెను. లేనియెడల మీ తాలూకు ఈ దిగువ షెడ్యూలు ఆస్తి జప్తు చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

SCHEDULE

Presently Eluru District, previously West Godavari District, Bhimadole Sub Registrar, Dwaraka Tirumala Mandalam, Gunnampalli Panchayati Village, Zeroyati Dry, R.S. No. 237/1A after sub division R.S. No. 237/1A-1 to an extent of Ac. 1-72 1/2 cents or 8349 sq.yards of land within the following boundaries.

EAST: Road and Sunkavalli Satyanarayana.
SOUTH: Land of Guttikonda Ramarao.
WEST: Land of Sunkavalli Harshita Satya Sri.
NORTH: Land of Maddukuri Laskhmi Madhavi.

Within the above boundaries to an extent of A. 1-72 1/2 cents or 8349 sq.yards of land in that 1/4th undivided share of the defendant with all easement rights.

The Plaintiff's Value is at Rs. 30,00,000/-

KUSULURI SIVA RAMA KRISHNA
Advocate for Plaintiff
Tadepalligudem Tadepalligudem
Date: 07-03-2024 Cell: 9949076266

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆగిరిపల్లి

టెండరు ప్రకటన

ఆర్.సి. నెం.44/జెఎ 2024 **తేది.07-03-2024**

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఈ క్రింది షెడ్యూలు దాఖలు రోజువారి పనుల నిమిత్తం అనుభవము గల ఏజెన్సీలు కాంట్రాక్టర్లు నుండి ది. 16-03-2024వ తేది మధ్యాహ్నం గం॥ 12.00ల వరకు సీల్డు టెండర్లు ఆహ్వానించడం అయినది. దాఖలైన టెండర్లను అదేరోజు మధ్యాహ్నం గం॥ 12.30 ని॥లకు అప్పటివరకు వచ్చిన టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరవబడును. ఇతర వివరములు కార్యాలయము పనివేళ యందు తెలుసుకొనవచ్చును. దాఖలైన టెండర్లు ఆమోదించుట లేదా తిరస్కరించుట లేదా రద్దుపరచుటకు గ్రామపంచాయతీ వారికి పూర్తి అధికారము కలదు. ధరావతు చెల్లించని టెండర్లు పరిశీలించబడవు.

నెం.	పనుల వివరములు	పనిచేయవలసిన కాలము	చెల్లించవలసిన ధరావతు
1	పారిశుధ్య పనులు చేయుట 15 మంది వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 5,000/-లు
2	పైప్ లైన్ ఫిట్టర్ కమ్ మోటార్ ఆపరేటర్ 3 వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 5,000/-లు
3	వీధి విద్యుద్దీపాలు రిపేరులు 2 వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 2,000/-లు

గమనిక: 1. అనుభవము బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. నెలవారి చెల్లింపులు గ్రామపంచాయతీ సాధారణ నిధులు లభ్యతలను అనుసరించి చెల్లించబడును. 3. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వ్యక్తి ఒక్కింటికి నెలకు రూ. 10,000/-లు మించకుండా రోజువారీ దామాషా లెక్కన టెండరు దాఖలు చేయవలెను. 4. త్రాగునీటి సరఫరా పనులకు టెండరు దాఖలు చేయువారు ITI సర్టిఫికెట్ పొంది నెల వారి రెండుసార్లు OHSR క్లీనింగ్ మరియు పైపు లైన్లకు ఏర్పడే లీకులకు గుంతలు త్రవ్వు పనిని నిర్వహించు షరతున టెండర్లు స్వీకరించబడును.

శ్రీమతి చవటపల్లి లక్ష్మి, సర్పంచ్
గ్రామపంచాయతి, ఆగిరిపల్లి, ఆగిరిపల్లి మండలం
సం/- **బి.ప్రసాద్,** పంచాయితీ కార్యదర్శి
ఆగిరిపల్లి

గ్రామపంచాయతీ కార్యాలయము, అమ్మవారిగూడెం

టెండరు ప్రకటన

ఆర్.సి. నెం.14/ఎ1 2023 **తేది.07-03-2024**

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, అమ్మవారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఈ క్రింది షెడ్యూలు దాఖలు రోజువారి పనుల నిమిత్తం అనుభవము గల ఏజెన్సీలు కాంట్రాక్టర్లు నుండి ది. 18-03-2024వ తేది మధ్యాహ్నం గం॥ 12.00ల వరకు సీల్డు టెండర్లు ఆహ్వానించడం అయినది. దాఖలైన టెండర్లను అదేరోజు మధ్యాహ్నం గం॥ 12.30 ని॥లకు అప్పటి వరకు వచ్చిన టెండరుదారుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వారిచే లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు తెరవబడును. ఇతర వివరములు కార్యాలయము పనివేళ యందు తెలుసుకొనవచ్చును. దాఖలైన టెండర్లు ఆమోదించుట లేదా తిరస్కరించుట లేదా రద్దుపరచుటకు గ్రామపంచాయతీ వారికి పూర్తి అధికారము కలదు. ధరావతు చెల్లించని టెండర్లు పరిశీలించబడవు.

నెం.	పనుల వివరములు	పనిచేయవలసిన కాలము	చెల్లించవలసిన ధరావతు
1	పారిశుధ్య పనులు చేయుట 02 మంది వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 1,000/-లు
2	పైప్ లైన్ ఫిట్టర్ కమ్ మోటార్ ఆపరేటర్ 01 వ్యక్తులు	ది.01-04-2024 నుండి 31-03-2025 వరకు	రూ. 500/-లు

గమనిక: 1. అనుభవము బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును. 2. నెలవారి చెల్లింపులు గ్రామపంచాయతీ సాధారణ నిధులు లభ్యతలను అనుసరించి చెల్లించబడును. 3. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వ్యక్తి ఒక్కింటికి నెలకు రూ. 10,000/-లు మించకుండా రోజువారీ దామాషా లెక్కన టెండరు దాఖలు చేయవలెను. 4. త్రాగునీటి సరఫరా పనులకు టెండరు దాఖలు చేయువారు ITI సర్టిఫికెట్ పొంది నెల వారి రెండుసార్లు OHSR క్లీనింగ్ మరియు పైపు లైన్లకు ఏర్పడే లీకులకు గుంతలు త్రవ్వు పనిని నిర్వహించు షరతున టెండర్లు స్వీకరించబడును.

శ్రీ జలసూత్రం కొండలరావు, సర్పంచ్
గ్రామపంచాయతి, అమ్మవారిగూడెం, ఆగిరిపల్లి మండలం
సం/- **బి.ప్రసాద్,** పంచాయితీ కార్యదర్శి
అమ్మవారిగూడెం